క్లుప్తంగా

తాటి, ఈత చెట్ల తొలగింపుపై నిరసన



రగుడు శివారులో నరికివేసిన చెట్లు

సిరిసిల్ల: పట్టణ శివారులోని రగుడు వద్ద తాటి, ఈత చెట్లను కొందరు అక్రమంగా తొలగిస్తున్నారని గీత కార్మికులు సోమవారం ఆందోళన వ్యక్తంచేశారు. గీత కార్మికులకు ఉపాధిని అందించే ఏళ్లనాటి తాటి, ఈత చెట్లను నరికి వేస్తూ ఉపాధి దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెట్లను దశల వారీగా నరికివేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాటి, ఈత చెట్ల తొలగింపును అడ్డుకోవాలని వంగ అనిల్ కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈత, తాటి చెట్ల తొలగింపును అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అనిల్ కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న కౌన్సిలర్ నీరజ

సిరిసిల్లటౌన్: పట్టణంలోని 17వ వార్డులో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ అందజేశారు. వార్డుకు చెందిన సాజీదాకు రూ. 6,500, నజీరాకు రూ.17,000, పయ్యావుల రజితకు రూ.9,500, సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కలను పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, బీఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకూర్‌పల్లి తండాలో సోమవారం మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ సర్పంచ్ ఆజ్మీరా మంజుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, యశ్వంత్, చందు, ప్రకాశ్‌నాయక్, భాస్కర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మధుకర్

సిరిసిల్లటౌన్: తెలంగాణ మాదిగ ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిరిసిల్లకు చెందిన లింగంపెల్లి మధుకర్ నియామకమయ్యారు. సోమవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పిడమర్తి రవి ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి సహకరించిన రవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సినారెకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న కళాకారులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని నృత్య కళానికేతన్ సేవాసంస్థ కార్యాలయంలో డాక్టర్. సి.నారాయణరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాకారులు, జేఏసీ నాయకులు రాములు, శ్రీనివాస్, వారాల దేవయ్య, లక్ష్మీనారాయణ, సంతోష్, సోమినేని బాలు, శ్రీకాంత్, శంకరయ్య, బొజ్జ కనుకయ్య, నేర్ల తిరుమల్‌గౌడ్, సంజీవ్, నాగరాజు తదితరులున్నారు.

వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నాం

ఎల్లారెడ్డిపేట: కొన్ని నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నట్లు 1962 పశుసంచార వాహన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2017 సెప్టెంబర్‌లో సంచార పశువైద్యసేవలు ప్రారంభమైనప్పటి నుంచి పనిచేస్తున్నట్లు తెలిపారు. కొన్ని వేల మూగజీవాల ప్రాణాలు నిలిపిన తమకు నేడు వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుంచి ఇప్పటి వరకు ఇంక్రిమెంట్లు లేవన్నారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డిపేట వాహనం డాక్టర్ రవికుమార్, హెల్పర్ ప్రవీణ్, సిబ్బంది ధ్యాగం నరేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

బోయినపల్లి: బదిలీపై వెళ్తున్న మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి షబానా సుల్తానియాను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య, రిటైర్డ్ ఎంఈఓ సీ. రామరాజు, మేడిద మల్లయ్య, నల్లాల పద్మ, బూర్గుల రాధ, నల్లాల బాలరాజు, భాగ్యలక్ష్మి, సంధ్య, కవిత, అహల్య, అనిత తదితరులు ఉన్నారు.

చి‘వరి’కి నీరందేనా ?

- చెత్త, గుర్రపు డెక్కతో నిండిన ఎగువ మానేరు ప్రాజెక్టు కెనాల్
- వానాకాలం పంటలకు సాగునీరు కష్టమే..
- సీజన్ మొదలైనా చేపట్టని పనులు
- ఆందోళన చెందుతున్న రైతులు



గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలతో నిండిపోయిన మానేరు కెనాల్

ముస్తాబాద్: మానేరు ప్రాజెక్టు కెనాల్‌పై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాగుకాలం సమీపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు జిల్లాకే కీలకం. ప్రాజెక్టులో నీరు ఉంటేనే జిల్లాలో భూగర్భజలాలు ఉంటాయి. అయితే ఏటా పంటకాలం సీజన్‌లోనే ప్రాజెక్టు కెనాల్స్‌కు మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ వానాకాలంలో ఇప్పటికే నెలన్నర రోజులు గడిచిపోగా, వచ్చే కొద్ది నీటితోనైనా పంటలు పండించుకుందాం అనుకున్న రైతుల ఆశలు ఆవిరిగానే మిగిపోతాయోనన్న అభిప్రాయాలున్నాయి.

10వేల ఎకరాల ఆయకట్టు..

నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు కుడికాలువ ద్వారా మండలానికి ఏటా సాగునీటిని విడుదల చేస్తున్నారు. 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు కుడికాలువ ద్వారా నీటిని వదులుతారు. అయితే 22 కిలోమీటర్ల ప్రధాన కెనాల్ మొత్తం గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు, చెత్త, గడ్డితో నిండిపోయింది. లోతు చెరువు నుంచి గోపాల్‌పల్లె మీదుగా రాంరెడ్డిపల్లె, నామాపూర్, గూడూరు, పోతుగల్, ముస్తాబాద్, తెర్లుమద్ది వరకు ఉన్న ప్రధాన కెనాల్‌లో గుర్రపు డెక్క ఉంది. పట్టణంలోని మురుగునీరంతా కుడి కెనాల్‌లోకే చేరడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు మురుగు, సిల్ట్, గుర్రపు డెక్కతో కూలీలు, రైతులు కెనాల్‌లోకి దిగేందుకు సాహసించడం లేదు. దీంతో చివరి ఆయకట్టు గ్రామాలైన పోతుగల్, ముస్తాబాద్, తెర్లుమద్దితోపాటు, ఉపకాలువలు ఉన్న కొండాపూర్, ఆవునూర్, గూడెం గ్రామాలకు నీరందడం లేదు.

డిస్ట్రిబ్యూటరీల షట్టర్లు ధ్వంసం

గోపాల్‌పల్లె నుంచి రాంరెడ్డిపల్లె, కొండాపూర్, ఆవునూర్, పోతుగల్, ముస్తాబాద్, తెర్లుమద్ది గ్రామాలకు సాగునీరందించే ఎగువమానేరు ప్రాజెక్టు కుడి కాలువపై 24 వరకు డిస్ట్రిబ్యూటరీ షట్టర్లు ఉన్నాయి. చాలా చోట్ల షట్టర్లు ధ్వంసమయ్యాయి. గూడూరు, నామాపూర్, పోతుగల్‌లో 12 నుంచి 22 డిస్ట్రిబ్యూటరీ వరకు షట్టర్లు ధ్వంసమయ్యాయి. మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉపాధిహామీపైనే ఆశలు..

ఏటా రైతుల ఆందోళనతో నీటి పారుదలశాఖ అధికారులు చేసే ప్రతిపాదనలకు నిధులు రావడం లేదనే విమర్శలున్నాయి. గత ఐదేళ్లుగా ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో కెనాల్స్‌ను బాగుచేయిస్తున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే మరమ్మతు, శుభ్రం చేస్తే, ప్రాజెక్టు నుంచి వచ్చేనీరు చివరి ఆయకట్టుకు చేరుతుంది.

తైబందీపై రైతుల రంది..

వానాకాలం, రబీ సీజన్‌లో మానేరు ప్రాజెక్టు ఆయకట్టుపై అధికారులు ఆయాగ్రామాల బాధ్యులతో తైబందీ నిర్వహిస్తారు. ఈసారి వర్షాలు ముఖం చాటేయగా, కొద్దిపాటు వానలకు ప్రాజెక్టులోకి నీరు చేరింది. కుడి కెనాల్ ద్వారా నీరు విడుదల చేస్తే చివరి ఆయకట్టు వరకు ఈ సమయంలో నీరు చేరేది. అయితే ప్రాజెక్టు నిండిన అనంతరమే అధికారులు తైబందీ నిర్వహించడంతో నీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా ప్రాజెక్టు మత్తడి పోస్తుందని, పంటపొలాలకు ముందే నీరందిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ముస్తాబాద్‌లో మానేరు కెనాల్ మొత్తం మురుగునీరు, చెత్త, గుర్రపు డెక్కతో నిండింది. మాపొలం వద్ద కయ్యలు కొడుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కెనాల్‌పై నుంచి పొలాల్లోకి నీరు వస్తోంది. కట్టకు మరమ్మతు చేయాలి.

– కుంభాల రాజిరెడ్డి, రైతు, ముస్తాబాద్

చివరి గ్రామాలకు నీరివ్వాలి



ప్రాజెక్టు ఆయకట్టు నిర్ణయించి ముందే కెనాల్‌కు మరమ్మతులు చేయాలి. శిథిలమైన, ధ్వంసమైన డిస్ట్రిబ్యూటరీలను బాగుచేయాలి. కెనాల్స్ శుభ్రం చేయాలి. చివరి ఆయకట్టు రైతులకు మానేరు నీరందించాలి. కెనాల్ నిర్వహణపై ప్రణాళిక ఉండాలి.

– కిషన్‌రావు, నీటి సంఘాల మాజీ చైర్మన్

నిధులు రాగానే పనులు



ఉపాధిహామీ కూలీలతో కెనాల్స్‌లో పేరుకుపోయిన సిల్ట్, గుర్రపు డెక్క తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈజీఎస్ అధికారులతో చర్చించాం. చివరి ఆయకట్టుకు నీరందేలా మరమ్మతు పనులకు ప్రతిపాదనలు చేశాం. నిధులు రాగానే పనులు చేపడుతాం

– వంశీకృష్ణ, నీటిపారుదల ఏఈ, ముస్తాబాద్

సాహిత్య గురువుకు ‘జూకంటి’ సన్మానం



సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి, రచయిత జూకంటి జగన్నాథం తన సాహిత్య గురువు జక్కని వెంకటరాజంను సోమవారం సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో దాశరథి సాహిత్య పురస్కారాన్ని తనకు ప్రభుత్వం అందించిన సందర్భంగా జూకంటి జగన్నాథం తన సాహిత్య గురువు జక్కని వెంకటరాజంను ఆయన ఇంట్లో సన్మానించారు. కార్యక్రమంలో కవి, రచయిత ఆడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేయొద్దు



మాట్లాడుతున్న టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ: అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేయవద్దని టౌన్ సీఐ వీరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం తన చాంబర్‌లో డీజే నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. రానున్న గణేశ్ ఉత్సవాలతోపాటు ఇతర పండుగల సందర్భంగా డీజేలు పెట్టి, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. డీజేలు నిర్వహిస్తే పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రుద్రంగి: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అర్చన అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి



మాట్లాడుతున్న వకుళాభరణం శ్రీనివాస్

వేములవాడరూరల్: వచ్చే స్థానిక ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో మనలో మనకు పోటీ వద్దని అందరూ కలిసి సూచించిన వ్యక్తిని ఎంపిక చేయాలని వేములవాడ రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయంలో రూరల్ కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ పదవుల కోసం పార్టీలో రోజురోజుకూ పెరుగుతున్న ఆశావాహుల సంఖ్య విషయంలో అందరూ ఎంపికచేసిన అభ్యర్థినే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సూచిస్తామన్నారు. ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించే దిశగా ప్రతి కార్యకర్త కృషిచేయాలి ఆయన కోరారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రవీణ్‌కే మద్దతివ్వాలి

వేములవాడ రూరల్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా రోమాల ప్రవీణ్‌కే మద్దతు ఇవ్వాలని రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ సూచించారు. నూకలమర్రికి చెందిన రోమాల ప్రవీణ్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, పార్టీకి సంబంధం లేని కొందరు పోటీచేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని, అలాంటి వారికి మద్దతు ఇవ్వవద్దని కోరారు.

సీసీరోడ్డు వేశారు.. విద్యుత్ స్తంభం మరిచారు



వీర్నపల్లి: మండలకేంద్రంలో వారంరోజుల నుంచి సీసీరోడ్డు పనులు సాగుతున్నాయి. అయితే ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే సీసీరోడ్డు పనులు పూర్తి చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించకుండా సీసీరోడ్డు వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు సీసీరోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రమాదాలబారిన పడకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

గెరువిచ్చి జల్లులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం గెరువిచ్చి ఓ జల్లు కురిసింది. పది రోజులుగా నిత్యం మబ్బులు కమ్ముకోగా సోమవారం ఉదయం గెరువచ్చి పట్టణంలో ఓ జల్లు కురిసింది. జిల్లాలోని ముస్తాబాద్‌లో 1.5 మిల్లీ మీటర్ల వర్షం పడగా రుద్రంగిలో 0.7, గంభీరావుపేటలో 0.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సిరిసిల్ల పట్టణంలో ఓ మోస్తరు వర్షం పడింది.

లీగల్ సెల్ కమిటీ



అశ్విన్

సిరిసిల్ల అర్బన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ నూతన కమిటీని సోమవారం ఆ పార్టీ లీగల్ సెల్ తెలంగాణ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నియమించారు. లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఇరుకుల్ల అశ్విన్, ఉపాధ్యక్షులు కె.వెంకట్ రెడ్డి, వంగ పర్శరాములు, కార్యదర్శులుగా పుప్పల బాలకృష్ణ, సిహెచ్.వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులుగా జెట్టి శేఖర్, నరాల శ్రీనివాస్, అల్లూరి చంద్రశేఖర్, బుర్ర వివేక్, స్పోక్స్ పర్సన్స్‌గా గౌడిశెల భగవాన్, కర్ల వంగను నియమిస్తూ నియామకపత్రం అందించారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రుద్రంగి: వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్

రుద్రంగి: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో ఎస్సై సిరిసిల్ల అశోక్‌తో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాల పత్రాలు పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఒకే ద్విచక్ర వాహనానికి ఒకే ద్విచక్రవాహనంపై రూ.2,945 తొమ్మిది చలాన్లు ఉండగా ఆన్‌లైన్ ద్వారా అప్పటికప్పుడు కట్టించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఏనుగు మనోహర్‌రెడ్డి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురంలో ఇటీవల అనారోగ్యంతో చిట్ల సరోజన మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఇక్కడ మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి, చిట్ల సతీశ్, సందీప్, రవీందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.



ఇళ్ల మధ్యే మురుగు

వేములవాడ: పట్టణంలోని 12వ వార్డులో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లమధ్యే మురుగు నిలిచిందని కాలనీవాసులు వాపోతున్నారు. పందులు, దోమల బెడదతో రోగాలబారిన పడుతున్నామని, దుర్వాసనతో అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇళ్ల మధ్య నిలిచిన మురుగును తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముగిసిన మహంకాళి బోనాల జాతర

వేములవాడ: పట్టణంలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు సోమవారం అమ్మవారికి పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రభ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గొర్రెపొట్టేళ్లు, పలహార బండ్లు, పోతరాజుల విన్యాసాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పువాయిద్యాల మధ్య అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మాజీ ఎంపీపీ, తదితరులు

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపెల్లి గ్రామానికి చెందిన జుట్టు హారిక అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా వైద్య ఖర్చులకోసం రూ.2 లక్షల ఎల్‌వోసీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంజూరుచేయించారు. సోమవారం ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్ ఎల్‌వోసీని హారిక కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హారిక కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు. తాళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పల్లె రాజశేఖర్ రెడ్డి, గుమ్ముటాల నరసింహారెడ్డి, రామస్వామి ,ఆదిరెడ్డి ,తిరుపతి గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

వేములవాడ: నియోజకవర్గానికి సాంకేతిక, పరిపాలనా అనుమతులు పొంది, టెండర్లు కూడా పూర్తయిన రోడ్లు, బ్రిడ్జిలు, రోడ్డు విస్తరణ నష్ట పరిహారం, పట్టణంలోని 1200 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణ అనుమతులకు నిధులు విడుదల (సంకెపల్లిలో 45 ఇళ్ల పరిహారంతో పాటు) చేసి పనులు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో మంజూరైన రూ.155 కోట్లను విడుదల చేయాలన్నారు.

నూతన భవనం నిర్మించాలి



కోనరావుపేట: మండలకేంద్రంలోని సెస్ కార్యాలయం వర్షాలకు ఉరుస్తోంది. వారం రోజులుగా ముసురువాన కురవడంతో సెస్ కార్యాలయం గోడలన్నీ తడిసిపోయాయి. వైస్‌చైర్మన్ చాంబర్‌లోకి నీరు చేరింది. ఉరుస్తున్న గోడల మధ్య, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి: గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోడికార్ హి రోజి కోరారు. వైద్యులు నిర్వహించి అవసరమున్న వారికి కంటి అద్దాలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



కోనరావుపేట: ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు లభిస్తుందని సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కాశవేని మహేశ్ అన్నారు. కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ పవన్‌కుమార్ బదిలీపై వెళ్లగా సోమవారం కొలనూర్ సింగిల్‌విండో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో సీఈవో గాజుల రాజేశం, సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. యువకుడికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్ది శివారులో ఓ యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన రాసమల్ల మణికంఠ (23) బైక్‌పై తెర్లుమద్ది నుంచి దుబ్బాకకు వెళ్తుండగా తెర్లుమద్ది విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో మణికంఠ కుడిచెవి పూర్తిగా తెగి రక్తస్రావం జరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

కళాకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

వేములవాడ: కళాకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించాలని కళాకారులు కోరారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందించారు.

ఘనంగా బోనాలు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ శ్రీవాణి స్కూల్‌లో సోమవారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, నెత్తిన బోనాతో ర్యాలీ నిర్వహించారు. పలువురు విద్యార్థులు పోతరాజు విన్యాసాలతో అలరించారు. కరస్పాండెంట్ పెద్దిగారి శ్రీనివాస్, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, గోద శ్రీను, భానుచందర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోతులబారినుంచి కాపాడాలి

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన అడ్డగట్ల వెంకటి ఇంట్లో కోతులు చొరబడి వస్తువులన్నీ చిందరవందర పడేశాయి. వెంకటి మూడు రోజుల పాటు బంధువుల ఇంటికి వెళ్లాడు. వచ్చి చూసేసరికి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేసి బియ్యం, నిత్యావసర సరుకులను కిందపడేశాయి. నిన్న మొన్నటి వరకు పంట చేలల్లో ఉన్న కోతులు రెండురోజులుగా పెంకుటిళ్లలో చొరబడి ఇంట్లో వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాన్ని కోతుల బారినుంచి కాపాడాలని కోరారు.